సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 25 । మే । 2025



రెక్కీలు చేసి..

కాలనీల్లో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. రెక్కీలు నిర్వహించి మరీ చోరీలకు తెగబడుతున్నారు.

8లో▸



హార్స్ జంపింగ్‌లో యువతి

గుర్రపు స్వారీ అదుర్స్

శంకర్‌పల్లి మండలం జన్వాడలోని నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ ఈక్వెస్ట్రియన్–2025 పోటీలు శనివారంతో ముగిశాయి. అండర్–10, అండర్–16, ఓపెన్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన పలు క్లబ్‌ల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. – శంకర్‌పల్లి

అమ్మో ఆడబిడ్డా..!

కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తెలిస్తే చాలు అబార్షన్లు

- ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న కొన్ని డయాగ్నోస్టిక్స్
- గర్భంలో పెరుగుతున్నది ఎవరో ముందే నిర్ధారణ
- ఆడబిడ్డయితే గుట్టుగా వదిలించుకుంటున్న వైనం
- బాలబాలికల జనన నిష్పత్తిలో భారీగా వ్యత్యాసం



ఐదేళ్లలో నమోదైన ప్రసవాలు, ప్రతి వెయ్యి మంది బాలురకు బాలికల నిష్పత్తి

సంవత్సరం	ప్రసవాలు	నిష్పత్తి
2020–2021	40,998	892
2021–2022	42,884	925
2022–2023	42,823	917
2023–2024	40,761	907
2024–2025	40,153	925

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పుత్రుడు మాత్రమే పున్నాగ నరకం నుంచి తప్పిస్తాడనే విశ్వాసం.. తన తర్వాత వంశం అంతరించిపోకుండా కాపాడతాడనే నమ్మకం.. ఆడపిల్ల పుడితే తనతోనే వంశం అంతరించి పోతుందనే భయం.. ఉన్నత చదువులు, పెళ్లిళ్లు, కట్నకానుకల పేరుతో మోయలేని ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తుందన్న అభద్రతాభావం.. వెరసి పురిట్లోనే ఆడబిడ్డలను నులిమేస్తున్నారు. కడుపులో ఉన్నది ఆడబిడ్డ అని తెలిస్తే చాలు కనికరం కూడా లేకుండా అబార్షన్లు చేయించేస్తున్నారు. కన్ను తెరవక ముందే కాటికిపంపుతున్నారు. ఫలితంగా బాలబాలిక నిష్పత్తిలో భారీ వ్యత్యాసం నమోదవుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో ప్రతి వెయ్యి మంది బాలురకు 950 మంది బాలికలు ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య మరింత తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. కేవలం 14 ఏళ్లలోనే ఈ నిష్పత్తి 25 శాతానికి పడి పోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

ముందుగానే చెప్పేస్తున్నాయి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి గుర్తింపు పొందిన స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ, జనరల్ నర్సింగ్‌హోమ్స్, పీడియాట్రిక్ క్లినిక్స్, ఈఎన్‌టీ, కంటి ఆస్పత్రులు, డెంటల్ క్లినిక్స్ 1,250 వరకు ఉన్నట్లు అంచనా. వీటిలో 350 వరకు డయాగ్నోస్టిక్స్ ఉన్నాయి. రక్త, మూత్ర పరీక్షలతో పాటు ఎముకల ధృడత్వం, శరీరంలోని వివిధ అంతర్గత అవయవాల పనితీరును పరీక్షించాల్సిన డయాగ్నోస్టిక్స్ సెంటర్లు కాసులకు కక్కుర్తి పడి కడుపులో ఉన్నది ఆడో, మగో చెప్పేస్తున్నాయి. అప్పటికే ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు మళ్లీ ఆడబిడ్డే పుట్టనుందని తెలిసి అబార్షన్లు చేయించుకుంటున్నారు. మరికొంత మంది ఏకంగా మగ పిల్లలు మాత్రమే కనాలని కండిషన్లు పెడుతున్నారు. తల్లిదండ్రుల్లో ఉన్న బలహీనతను డయాగ్నోస్టిక్స్ యాజమాన్యాలు క్యాష్ చేసుకుంటున్నాయి. చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, యాచారం, ఆమనగల్లు, బాలాపూర్, మీర్‌పేట, బడంగ్‌పేట్, శివరాంపల్లి, శేరిలింగంపల్లి, నార్సింగి, తుక్కుగూడ, మహేశ్వరం, తుర్క యంజాల్, పెద్ద అంబర్‌పేట తదిత ప్రాంతాల్లోని ల్యాబ్‌లు వైద్య పరీక్షల పేరుతో అడ్డదారులు తొక్కుతున్నాయి. పరోక్షంగా ఆడపిల్లల నిష్పత్తి తగ్గిపోవడానికి కారణమవుతున్నాయి. ఎప్పటికప్పుడు ఆయా సెంటర్లను తనిఖీ చేయాల్సిన వైద్యాధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

పీఎన్‌డీటీపీఏసీ ఏం చెబుతోందంటే..

- కడుపులో పెరుగుతున్న బిడ్డకు ఏమైనా జన్యుపరమైన లోపాలు ఉన్నాయా.. శిశువు పెరుగుదల ఎలా ఉంది.. అనే అంశాలను తెలుసుకునేందుకు మాత్రమే అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించాలి.
- కడపులోని బిడ్డ ఆడో, మగో ఎట్టిపరిస్థితుల్లోనూ చెప్పకూడదు.
- లింగ నిర్ధారణకు సహకరించిన వారికి మూడు నెలలు జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తారు.
- రెండోసారి కూడా ఇదే తప్పు చేసిన వారికి ఐదు సంవత్సరాల జైలు, రూ.50 వేల జరిమానా విధించే అవకాశం ఉంది.
- ఇలాంటి పనికి పూనుకున్నది వైద్యులైతే వారి వృత్తి లైసెన్స్ కూడా రద్దవుతుంది.
- గర్భంలోని శిశువును ఆడ, మగ పోల్చమని కోరిన వారికి మూడు సంవత్సరాల జైలు, రూ.50 వేల జరిమానా విధించవచ్చు.

ఫిర్యాదుదారుల నుంచి ఫీడ్‌బ్యాక్

బాలాపూర్ ఠాణాను తనిఖీ చేసిన డీసీపీ

పహాడీషరీఫ్: మహేశ్వరం డీసీపీ డి.సునీతా రెడ్డి శనివారం బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో ముచ్చటించారు. ఏ విషయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చారు.. ఫిర్యాదు స్వీకరించడంలో రిసెప్షనిస్ట్ ఎలా వ్యవహరించారు.. స్టేషన్ అధికారులు ఎలా స్పందించారు.. అంటూ వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. అనంతరం ఆమె స్టేషన్ పరిధిలో ఏ తరహా నేరాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయనే విషయమై స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఇన్‌స్పెక్టర్) సుధాకర్‌ను ఆరా తీశారు. పెండింగ్ కేసుల దర్యాప్తు ఏ విధంగా కొనసాగుతోందని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరుగుతుందన్న భరోసా కలిగించాలని సూచించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీసీపీ సునీతా రెడ్డి

సున్నితమైన ప్రాంతాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. బక్రీద్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో గోవుల రవాణాపై నిఘా ఉంచాలన్నారు. ఆమె వెంట మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి ఉన్నారు.

న్యూస్‌రీల్

శంకర్‌పల్లి మున్సిపాలిటీకి పీసీబీ అవార్డు

శంకర్‌పల్లి: పర్యావరణ పరిరక్షణలో శంకర్‌పల్లి మున్సిపాలిటీ ఉత్తమ పని తీరును గుర్తిస్తూ తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అవార్డు ప్రకటించిందని మున్సిపల్ కమిషనర్ యోగేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆరు మున్సిపాలిటీలను గుర్తించి అవార్డు ప్రకటించిందని తెలిపారు. దాంట్లో శంకర్‌పల్లి మున్సిపాలిటీకి అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు. జూన్ 5న పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ సనత్‌నగర్‌లోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో అవార్డు అందించనున్నట్లు చెప్పారు. రాబోయే కాలంలో మున్సిపాలిటీని మరిన్ని అవార్డులు వరించేలా కృషి చేస్తామని వివరించారు.

నష్టపరిహారం కోసం రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

తుక్కుగూడ: తమ భూములు తీసుకొని ఏళ్లు గడుస్తున్నా నష్ట పరిహారం ఇవ్వలేదని, పరిహారం ఇచ్చిన తరువాతే ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకోవాలని రైతులు ఆందోళనకు దిగారు. మున్సిపల్ పరిధిలోని జెన్నాయిగూడలో సర్వే నంబర్ 18 నుంచి 88 వరకు 827 ఎకరాల్లో 2004లో ఫ్యాబ్‌సిటీ ఏర్పాటు చేశారు. ఇందులో ప్రభుత్వం అనేక పరిశ్రమలకు భూములు కేటాయించింది. భూములు తీసుకొని 20 ఏళ్లు గడిచినా ఇంత వరకు రైతులకు పరిహారం అందలేదు. దీంతో అప్పటి నుంచి పోరాటం సాగిస్తున్నారు. గత ప్రభుత్వం ఫ్యాబ్‌సిటీలో భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. లాటరీ తీసి రెండేళ్లు అవుతున్నా ప్లాట్ల పొజిషన్ చూపించలేదు. ఈ క్రమంలో శనివారం నూతనంగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు భూమిని కేటాయించడానికి టీజీఐఐసీ అధికారులు ఫ్యాబ్‌సిటీకి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న రైతులు అధికారులను అడ్డుకున్నారు. తమకు న్యాయం జరిగేవరకు కదిలేదని లేదని ఫ్యాబ్‌సిటీ కమాన్ వద్ద నిరసనకు దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి నచ్చజెప్పినా వినిపించుకోకపోవడంతో అరెస్టు చేసి ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.

పరీక్ష రాసే అభ్యర్థులు మార్గదర్శకాలు పాటించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామపాలన అధికారి పరీక్షకు ఈ నెల 25న హాజరయ్యే అభ్యర్థులు సీసీఎల్‌ఏ మార్గదర్శకాలను అనుసరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు ధ్రువీకరించుకోవాలన్నారు. వ్యక్తిగత వివరాలు సరిగ్గా ఉన్నాయా లేదా, పరీక్ష కేంద్రం చిరునామా ముందుగానే చూసుకోవాలన్నారు. రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని, ఒక ఫొటో నియంత్రణాధికారి సంతకం చేసి హాల్‌టికెట్‌పై అంటించాలని, మరో ఫొటోను పరీక్ష గదిలో పర్యవేక్షకుడికి అప్పగించాలన్నారు. నిషేధిత ఎలక్ట్రానిక్ వస్తువులను తేవద్దని తెలిపారు. మొబైల్‌ఫోన్లు, డిజిటల్ వాచీలు, పెన్‌డ్రైవ్ ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష హాలులోకి నిషేధం అని చెప్పారు. బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌మాత్రమే తీసుకురావాలని ఆయన సూచించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 10 గంటల లోపు తప్పనిసరిగా చేరుకోవాలని, నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించరని స్పష్టం చేశారు. గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. అంతకు ముందు సీసీఎల్‌ఏ కమిషనర్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

రోహిణికి ముందే 'ఆరుద్ర'



తుక్కుగూడ: ఆరుద్ర కార్తె సమయంలో విరివిగా కనిపించే ఆరుద్ర పురుగు ఈసారి రోహిణికి ముందే దర్శనమిచ్చింది. ఏటా వానా కాలం ప్రారంభమైన తర్వాత ఆరుద్ర కార్తె సమయంలో మాత్రమే ఈ ఎర్రటి దూదిలాంటి పురుగులు కనిపిస్తుంటాయి. మూడు, నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మున్సిపల్ పరిధిలోని రావిర్యాల శివార్లలో ఆరుద్ర పురుగులు నేలలోంచి బయటికి వచ్చాయి.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

షాద్‌నగర్: నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం వ్యవసాయ, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగులు మందులను విక్రయించే వ్యాపారులపై పీడీ యాక్టుల కింద కేసులు నమోదు చేస్తామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు, మందులు అమ్మే వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని తెలిపారు. సమావేశంలో షాద్‌నగర్, శంషాబాద్ ఏసీపీలు లక్ష్మీనారాయణ, శ్రీకాంత్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, ఇన్‌చార్జి ఏడీఏ నిషాంత్‌కుమార్, సీఐ విజయ్‌కుమార్, ఏఓలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయాం.. న్యాయం చేయండి

చేవెళ్ల: నాణ్యతలేని నారుతో నష్టపోయామని, మోసం చేసిన నర్సరీ యజమానిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని మండలంలోని చనువెల్లి గ్రామానికి చెందిన బాధిత రైతులు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టర్, అగ్రికల్చర్ జేడీలను కలిసి ఫిర్యాదు చేశారు. చనువెల్లి గ్రామానికి చెందిన దాదాపు 42 మందికిపైగా రైతులు 70ఎకరాల వరకు బజ్జీ మిర్చి సాగు చేశారు. రెండు నెలల క్రితం ఖమ్మం జిల్లా వైరాలోని ఓ ప్రైవేటు కంపెనీ నర్సరీ నుంచి నారు కొనుగోలు చేశారు. పూత, కాత లేకపోవడంతో నాణ్యతలేని నారుతో మోసపోయినట్లు గుర్తించారు. దీనిపై పలుమార్లు నర్సరీ యజమానితో మాట్లాడినా స్పందించలేదు. దీంతో బాధిత రైతులు సదరు నర్సరీ యజమానిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని జిల్లా అధికారులను కలిశారు. కలెక్టర్ వద్దకు వెళ్లడంతో ఆయన వ్యవసాయాధికారిని కలవాలని సూచించడంతో జేడీ నర్సింహారావును కలిసి వివరించారు. న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చినట్టు రైతులు తెలిపారు.



జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న బాధిత రైతులు

కోవిడ్‌పై యుద్ధానికి సిద్ధం

- అప్రమత్తమైన వైద్యాధికారులు
- 'గాంధీ'లో 60 పడకలతో మూడు వార్డులు
- 10 మంది వైద్య నిపుణులతో కమిటీ
- వాట్సాప్ గ్రూప్‌ల ఏర్పాటు



గాంధీఆస్పత్రి: కరోనా.. మరోసారి వినిపిస్తున్న పేరు. దీని గురించి నెమ్మదిగా ప్రజలు మర్చిపోతున్న సమయంలో మళ్లీ ఆందోళనకు గురి చేస్తోంది. తాజాగా నగరంలో పాజిటివ్ కేసు నమోదు కావడంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. రాష్ట్ర నోడల్ కేంద్రమైన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సిద్ధమవుతోంది. 60 పడకలతో మూడు కోవిడ్ వార్డులు, ఆయా రంగాల్లో నిష్ణాతులైన పది మంది వైద్య నిపుణులతో కోవిడ్ కమిటీ ఏర్పాటు చేశారు. పాజిటివ్ కేసులు, అందిస్తున్న వైద్యసేవలు, మౌలిక వసతులు తదితర సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేందుకు వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. పాజిటివ్ కేసుల సంఖ్య పెరిగితే గాంధీ వైరాలజీ ల్యాబ్‌లో జీనోమ్ సీక్వెన్సింగ్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎన్ రాజకుమారి నేతృత్వంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారు.

15 పడకలతో అత్యవసర వార్డు..

గాంధీ ఎమర్జెన్సీ విభాగంలో ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యాలతో 15 పడకలతో అత్యవసర కోవిడ్ వార్డు ఏర్పాటు చేశారు. ప్రాణాపాయ స్థితిలో కోవిడ్ పాజిటివ్‌తో పాటు వచ్చే బాధితులకు ఇక్కడ వైద్యసేవలు అందిస్తారు. ఇన్‌పేషెంట్ భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో 25, ఫస్ట్ ఫ్లోర్‌లో 20 పడకలతో మరో రెండు వార్డులు అందుబాటులోకి తెచ్చారు. కరోనా పాజిటివ్ బాధితుల కోసం మందులు, టెస్టులు చేసేందుకు అవసరమైన రీఏజెంట్స్ (ద్రావకాలు) సిద్ధం చేశారు. కోవిడ్ లక్షణాలతో అడ్మిట్ అయినవారికి ఆర్‌టీపీసీఆర్ టెస్టులు నిర్వహిస్తారు. కోవిడ్ పాజిటివ్ కేసుల వ్యాప్తి పెరిగితే కోవిడ్ వైరస్ వేరియంట్లు, సబ్‌వేరియంట్లను గుర్తించేందుకు గాంధీ వైరాలజీ ల్యాబ్‌లో జీనోమ్ సీక్వెన్సింగ్ నిర్వహిస్తామని గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ తెలిపారు.

కోవిడ్ వైద్య నిపుణుల కమిటీ

కోవిడ్ రాష్ట్ర నోడల్ కేంద్రమైన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో అందించే వైద్యసేవలపై పదిమంది నిష్ణాతులైన వైద్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, నోడల్ అధికారిగా జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ ప్రొఫెసర్ సునీల్‌కుమార్‌లు వ్యవహరిస్తారు. కమిటీ ప్రతినిధులుగా డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, ఆర్ఎంఓ–1 శేషాద్రి, పల్మనాలజీ, అనస్థీషియా, గైనకాలజీ, పిడియాట్రిక్, మైక్రోబయోలజీ హెచ్ఓడీలు కృష్ణమూర్తి, ఆవుల మురళీధర్, రాధ, వాసుదేవ్, పూజలతో పాటు డ్యూటీ ఆర్ఎంఓ, వైద్యులు, వైద్యవిద్యార్థులు ఉంటారు.

లక్షణాలు ఇవీ..

కరోనా వైరస్ వివిధ రకాలుగా రూపాంతరం చెందినప్పటికీ లక్షణాల్లో మాత్రం మార్పు రాలేదని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. దగ్గు, జలుబు, శ్వాసకోశ ఇబ్బందులు, గొంతునొప్పి, ఒళ్లు, కీళ్ల నొప్పులు, నీరసం, ముక్కు కారడం, రుచి, వాసన కోల్పోవడం వంటి లక్షణాలను కోవిడ్‌గా పరిగణించాలని వైద్యులు సూచించారు.

గోల్కొండ కోటలో అధికారుల పర్యటన



గోల్కొండ: గోల్కొండ కోటలో జరిగే శ్రీ జగదాంబికా మహంకాళి అమ్మవార్ల బోనాల నిర్వహణకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని కేంద్ర పురాతత్వ శాఖ హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిఖిల్‌దాస్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండ కోట కన్జర్వేషన్ అసిస్టెంట్ మల్లేశంతో కలిసి కోటలోని వివిధ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బోనాల నిర్వహణకు అవసరమయ్యే ఏర్పాట్లను పరిశీలించారు. కోటలో బోనాలు జరిగే తొమ్మిది పూజల్లో భక్తులకు, పర్యాటకులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. తమవంతు సహకారంగా దేవాదాయ శాఖ వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు ఏర్పాట్లలో సహకరిస్తామన్నారు. వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, శ్రీ విశ్వకర్మ సేవా సమితి అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారిని కలిసి బోనాల నిర్వహణకు ఎప్పటిలాగే సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ఏసీబీకి చిక్కిన జగద్గిరిగుట్ట ఎస్‌ఐ



జగద్గిరిగుట్ట: బ్యాండ్ మేళం వారి నుంచి మధ్యవర్తి ద్వారా డబ్బులు తీసుకుంటూ నగరంలోని జగద్గిరిగుట్ట ఎస్‌ఐ శంకర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బల్కంపేటకు చెందిన కిరణ్ తన సిబ్బందితో మూడు నెలల క్రితం జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ శుభ కార్యానికి బ్యాండ్ వాయించారు. శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్నారంటూ బ్యాండ్‌కు సంబంధించిన వాహనంతో పాటు సామగ్రిని జగద్గిరిగుట్ట ఎస్సై శంకర్ సీజ్ చేశారు. వాటిని తిరిగి ఇచ్చేందుకు ఇదే ప్రాంతానికి చెందిన నాగేందర్ అనే వ్యక్తితో మధ్యవర్తిత్వం నెరిపి రూ.15 వేలు డిమాండ్ చేశాడు. తాను అంత మొత్తం ఇవ్వలేనని ప్రాధేయపడినా ఎస్‌ఐ కనికరించడలేదు. దీంతో కిరణ్ విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఎస్‌ఐ శంకర్ డిమాండ్ మేరకు శనివారం బాధితుడు రూ.15 వేల నగదును మధ్యవర్తి నాగేందర్‌కు అందజేస్తుండగా ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తన బృందంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ విషయమై నాగేందర్‌ను ఆరా తీయగా.. ఎస్‌ఐ శంకర్ తనను మధ్యవర్తిగా వ్యవహరించి డబ్బులు తీసుకోవాలని చెప్పినట్లు అంగీకరించాడు. దీంతో ఏసీబీ అధికారులు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు చేరుకొని సోదాలు నిర్వహించారు. అవినీతికి పాల్పడిన ఎస్‌ఐ శంకర్, అతనికి సహకరించిన నాగేందర్‌పై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

రెక్కీ చేసి.. పక్కాగా చోరీ

- పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు
- ఆందోళనకు గురవుతున్న ప్రజలు



కమ్మగూడలో రెక్కీ నిర్వహిస్తున్న దుండగుడు



వెస్ట్ సూరజ్ నగర్‌లో ఎలక్ట్రిక్ వాహనంపై రెక్కీ చేస్తున్న ఇద్దరు..

తుర్కయంజాల్: ఆదిబట్ల, వనస్థలిపురం పరిధిలోని కాలనీల్లో దొంగలు హల్‌చల్ చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు సాధారణమయ్యాయి. వేసవి సెలవులు, పెళ్లిళ్లు, ఫంక్షన్ల సీజన్ కావడంతో దుండగులు తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్నారు. ఇటీవల బయపడిన సీసీ టీవీ పుటేజీలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. ముందు ద్విచక్రవాహనాలపై రెక్కీ నిర్వహిస్తున్న దుండగులు ఆ తర్వాత తాళం వేసిన ఇళ్లకు కన్నం వేస్తున్నారు.

చోరీకి విఫలయత్నం

రాగన్నగూడలోని వెస్ట్ సూరజ్‌నగర్ కాలనీలో ఈ నెల 22న ఉదయం 11.45 గంటల సమయంలో ఇద్దరు యువకులు పసుపు రంగు ఎలక్ట్రిక్ వాహనంపై రెక్కీ నిర్వహించారు. సుమారు 20 నిమిషాల తర్వాత ద్విచక్ర వాహనాన్ని మరో చోట పార్క్ చేసి రోడ్ నంబర్-5లో ఓ ఇంట్లో చోరీకి యత్నించారు. బీరువా లాకర్ తెరిచేందుకు యత్నింగా అది ఓపెన్ కాలేదు. పై అంతస్తులో నివాసం ఉండేవారు కిందికి రాగా దుండగులు వారిని తోసేసుకుంటూ అక్కడ నుంచి పలాయనం చిత్తగించారు. ఇంటి యజమానులు పోలీసలకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకుని పొటోలు తీసుకుని వెళ్లిపోయారు. రెండు రోజులు గడుస్తున్నా పోలీసుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో శనివారం ఆదిబట్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు.

పికెటింగ్ దాటుకుని..

ఈ నెల 15న కమ్మగూడలోని శివాజీ నగర్ కాలనీలో సాయంత్రం 4 గంటల సమయంలో ఓ స్కూటీపై వచ్చిన యువకుడు ఇళ్లను గమనిస్తూ రెక్కీ నిర్వహించాడు. అనంతరం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డులోని ఓ ఇంటికి తాళం వేసి ఉండడంతో గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించాడు. తాళం తెరిచేందుకు విఫలయత్నం చేసి ఇంటి ఆవరణలోని సల్లాలను, వస్తువులను ధ్వంసం చేసి వెనుదిరిగాడు. సీసీలో పరిశీలించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఇదే కాలనీలో పోలీస్ పికెటింగ్ ఉన్నప్పటికీ చోరీకి యత్నించడం చర్చనీయాంశంగా మారింది.

పెట్రోలింగ్ పెంచాం

సీసీ టీవీ పుటేజీల ఆధారంగా దొంగలను గుర్తించే పనిలో ఉన్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు కాలనీల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. పెట్రోలింగ్ పెంచి భద్రతా కల్పిస్తున్నాం.

– రాఘవేందర్ రెడ్డి,సీఐ, ఆదిబట్ల

సత్వర సేవలకే 'స్లాట్ బుకింగ్'

రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ట్వింకిల్‌జాన్

మణికొండ: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే వారికి సత్వర, సులభ సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ట్వింకిల్ జాన్ అన్నారు. శనివారం నార్సింగిలోని గండిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ పద్ధతిపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొత్త పద్ధతిని కొనసాగిస్తున్నామన్నారు. ఆయా కార్యాలయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సునాయాసంగా ప్రజలు సేవలు పొందుతున్నారన్నారు. జూన్ 2వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ పద్ధతిని అమలు చేస్తామన్నారు. అందుకు సబ్‌రిజిస్ట్రార్‌లు పూర్తి స్థాయిలో సంసిద్ధులై ఉండాలన్నారు. కొత్త పద్ధతితో ప్రజలు కార్యాలయాల్లో ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం ఉండదన్నారు. వారికి కేటాయించిన స్లాట్ సమయానికి ఐదు నిమిషాల ముందు వచ్చి మరో ఐదు నిమిషాల్లో వారి రిజిస్ట్రేషన్ పూర్తవుతుందన్నారు. కార్యాలయాలకు వచ్చే బిల్డర్‌లు, ప్రజలకు కొత్త పద్ధతిపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా రిజిస్ట్రార్ సంతోష్, గండిపేట, శంకర్‌పల్లి, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి సబ్‌రిజిస్ట్రార్‌లు ఆంజనేయులు, బాసిత్‌ఖాన్, రాంభూపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్తూ మృత్యువాత

- గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం
- యాచారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు



అరుణ్ (ఫైల్)



అశోక్ (ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైక్

యాచారం: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కడ్తాల్ మండలం పల్లెచల్కతండాకు చెందిన విస్లావత్ అశోక్(22), నల్గొండ జిల్లా కొండపల్లెపల్లి మండలం దంజాలాల్‌తండాకు చెందిన రమావత్ అరుణ్(24) బావబామ్మర్దులు. పల్లెచల్కతండాలో ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు శుక్రవారం అర్ధరాత్రి 12:30 గంటలకు బైక్‌పై నగరం నుంచి బయల్దేరారు. యాచారం ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన అరుణ్ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రగాయాలైన అశోక్‌ను 108లో హైదరాబాద్ తరలిస్తుండగా చనిపోయాడు. వీరు ప్రయాణిస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనం నుజ్జునుజ్జయింది. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు శుక్రవారం రాత్రి 11- 30 నుంచి 12:30 గంటల వరకు సాగర్ రోడ్డుపై రాకపోకలు సాగించిన వాహనాల సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

హక్కుల సాధనకు పోరాడుదాం

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్

షాద్‌నగర్‌రూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) పనిచేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ శివారులోని ఎన్‌హెచ్-44 హోటల్‌లో టీడబ్ల్యూజెఎఫ్ నాయకుడు మల్లేశ్ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టుల డివిజన్ మహాసభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి సైదులు హాజరై మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పాత్రికేయుల గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలువంటి హక్కులను సాధించుకోవాలని అన్నారు. జర్నలిస్టులు హక్కుల సాధనకు ఏకతాటిపైకి రావాలన్నారు. అనంతరం నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా రాఘవేందర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా శీనయ్య, వెంకటయ్య, రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా నరేష్, కోశాధికారిగా రమేష్, సహాయ కార్యదర్శిగా రామకృష్ణగౌడ్, సలహాదారులుగా గోపాల్, కార్యవర్గ సభ్యులుగా మల్లేశ్, మల్లిఖార్జున్, నరేందర్‌గౌడ్, భాను, ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నేషనల్ కౌన్సిల్ సభ్యులు దేవేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.రమేష్, నాయకులు గణేష్, సురేష్, నర్సింహారెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో లారీని ఢీకొట్టిన బైక్

ద్విచక్ర వాహనదారుడు మృతి

చేవెళ్ల: రాంగ్‌రూట్‌లో ప్రయాణించి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలోని మిర్జాగూడ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా పరిగి మండలం ఎర్రగడ్డపల్లి గ్రామానికి చెందిన రాజాపురం దేవరాజు (49) బైక్‌పై చేవెళ్ల వైపు ప్రయాణిస్తున్నాడు. మిర్జాగూడ సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా చేవెళ్ల వైపు నుంచి వస్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి పడిపోయిన దేవరాజ్ తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అతని వద్ద లభించిన ఆధారాలతో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి శనివారం పోస్ట్ మార్టం నిర్వహించి కుటుంసభ్యులకు అప్పగించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెయింటెనెన్స్ పేరిట అక్రమ వసూళ్లు

పోలీసులకు ఫిర్యాదు చేసిన మున్సిపల్ కమిషనర్



డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్

శంకర్‌పల్లి: పట్టణ శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద మెయింటెనెన్స్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై మున్సిపల్ కమిషనర్ యోగేశ్ ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. యాకుత్‌పురా, కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం పట్టణ శివారులో సుమారు 1,500లకు పైగా డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి కేటాయించింది. వాటిని గత ఏడాది లబ్ధిదారులు కేటాయించారు. ఈ క్రమంలో శంకర్‌పల్లి మండలం మహాలింగాపురం గ్రామానికి చెందిన ఖురేషి భాయ్ అనే వ్యక్తి తనకు ప్రతీ నెల మెయింటెనెన్స్ ఇంటికి రూ.600 చెల్లించాలని బ్యానర్లు ఏర్పాటు చేశాడు. జీహెచ్ఎంసీ హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-3 నివాసితులు శనివారం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌ను ఆశ్రయించారు. ఇందుకు స్పందించిన ఆయన వెంటనే అక్కడకు చేరుకుని బ్యానర్ తొలగించారు. ఎవరికీ డబ్బు ఇవ్వొద్దని నివాసితులకు సూచించారు. నివాసితులే కమిటీ వేసుకుని మెయింటెనెన్స్ చేసుకోవాలని చెప్పారు. అనంతరం శంకర్‌పల్లి ఠాణాలో ఖురేషిపై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిరునామాలూ గల్లంతు!

- బోగస్ బర్త్ సర్టిఫికెట్ల బాగోతం
- చర్యలు లేనందునే ఆగని 'దందా'

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో జారీ అవుతున్న బర్త్, డెత్ సర్టిఫికెట్లలో అవకతవకలు, అక్రమాల గురించి ఎంతో కాలంగా వెల్లడవుతున్నప్పటికీ, తగిన కట్టడి చర్యలు లేనందున వాటికి అడ్డుకట్ట పడలేదని తెలుస్తోంది. తాజాగా టోలిచౌకిలోని మూతపడిన మెట్రో హాస్పిటల్ నుంచి 65 నకిలీ బర్త్, 8 నకిలీ డెత్‌సర్టిఫికెట్లను గుర్తించి రద్దు చేసినట్లు ప్రకటించిన జీహెచ్ఎంసీ.. రెండున్నరేళ్ల క్రితం దాదాపు 25వేల బర్త్ సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు జరిగాయని గుర్తించి, వాటన్నింటినీ రద్దు చేసినట్లు ప్రకటించింది. ఈ మేరకు పాస్‌పోర్ట్, ఇతరత్రా ప్రభుత్వ విభాగాలకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొంది. బాధ్యులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియదు. చర్యల లేమితోనే బోగస్ బాగోతానికి అడ్డుకట్ట పడలేదని తెలుస్తోంది. అప్పట్లో జారీ అయిన సర్టిఫికెట్లు నాన్ అవైలబిలిటీ (జననాలు ఆస్పత్రుల్లో జరగనివి) కింద దరఖాస్తు చేసుకున్నవి కాగా, తాజాగా గుర్తించినవి ఆస్పత్రులు తప్పుడు సమాచారం ఇవ్వడంతో జారీ అయినవి. ఆస్పత్రులపై అధికారులు దృష్టి సారించనందునే ఇవి జారీ అయినట్లు తెలుస్తోంది. ఇంకా ఎన్ని ఆస్పత్రుల్లో ఇలాంటి తతంగాలు జరిగాయో అంతు చిక్కని అంశంగా మారింది.

ప్రత్యేకంగా 'సిట్' ఏర్పాటు..

అప్పటి బోగస్ సర్టిఫికెట్లకు సంబంధించి జీహెచ్ఎంసీ అధికారులు వివిధ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో కేసులు కూడా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వాటి నిగ్గు తేల్చేందుకు పోలీసులు ప్రత్యేకంగా 'సిట్' ఏర్పాటు చేసినట్లు సమాచారం. తాజాగా నకిలీ బర్త్ సర్టిఫికెట్ల బాగోతం బయట పడటంతో గతంలో పాతబస్తీలోని ఒక మీ సేవ కేంద్రం నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న దాదాపు 250 బర్త్ సర్టిఫికెట్లకు సంబంధించి అవి ఒరిజినల్‌వా, లేక నకిలీవా తెలియజేయాల్సిందిగా జీహెచ్ఎంసీ అధికారులను తాజాగా కోరినట్లు తెలిసింది. ఒకవేళ నిజమైనవే అయితే సర్టిఫికెట్లు పొందేందుకు వారు జతచేసిన పత్రాలు, దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు తదితరమైనవి తెలియజేయాల్సిందిగా కోరినట్లు సమాచారం.

- ఈ నేపథ్యంలో అప్లికేషన్ నెంబర్ల ఆధారంగా ఆన్‌లైన్‌లో పరిశీలించిన జీహెచ్ఎంసీ యంత్రాంగం ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడమే కాక దరఖాస్తు చేసుకున్న వారి చిరునామా కూడా లేకపోవడాన్ని గుర్తించినట్లు తెలిసింది.బర్త్ సర్టిఫికెట్లు అవసరమైన వారి నుంచి అధిక మొత్తాలు వసూలు చేసి వాటిని ఇప్పించేందుకు అలవాటు పడ్డ కొన్ని మీసేవా కేంద్రాల నిర్వాహకులు, తదితరులు కుమ్మక్కై నాన్ అవైలబిలిటీ కింద దరఖాస్తు చేయించి వాటిని జారీ చేశారనే అభిప్రాయాలున్నాయి. అప్పట్లో జారీ అయిన వాటికి సంబంధించి బాధ్యులపై ఇప్పటి దాకా తగిన చర్యలు లేనందునే వివిధ మార్గాల్లో నకిలీ సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో అక్రమాలిలా ..

ఆస్పత్రుల్లో జరిగే జనన, మరణాల రిపోర్టుల ఆధారంగా సదరు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. ఆస్పత్రుల్లో కాకుండా జరిగే జనన, మరణాలకు నాన్ అవైలబిలిటీగా పేర్కొంటూ ఆర్‌డీఓ జారీ చేసే ప్రొసీడింగ్స్‌ను బట్టి సర్టిఫికెట్లు జారీ చేస్తారు. ఆర్‌డీఓ జారీ చేసే పత్రాల బదులు వివిధ రకాల నకిలీ పత్రాలు, తెల్లపేపర్లు సైతం అప్‌లోడ్ చేసినా బర్త్, డెత్ సర్టిఫికెట్లు జారీ అయినట్లు గుర్తించారు.